క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ బాలాజీ వెంచర్, 11కేవీ మల్లంపేట్, 11కేవీ ప్రణీత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

◆ బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో శుక్రవారం 11కేవీ ఏసీ టైర్, మల్లంపేట్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దేవీ హోమ్స్, మమత ఆస్పత్రి, ప్రణీత్ జనీత్, రెయిన్‌బో కాలనీ, బాచుపల్లి సిగ్నల్ నుంచి చైతన్య కాలేజీ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

రేపు పౌరాణిక పద్యనాటక ప్రదర్శన

నిజాంపేట్: బండారి లేఅవుట్‌లో శ్రీరామకృష్ణ నాట్యమండలి ఆధ్వర్యంలో ఈనెల 13న పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి కొనసాగే సాంస్కృతిక కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీదక్షిణముఖ అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ ఓ ప్రకటనలో కోరింది.

స్పెషల్ గ్రేడ్ ఆఫీసర్‌గా శ్రీహరి



కమిషనర్ శ్రీహరిని సత్కరిస్తున్న కొంపల్లి చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీహరి స్పెషల్ గ్రేడ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. గురువారం కొంపల్లి మున్సిపల్ కమిషనర్ సన్న శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఈ చిరంజీవులు, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న రంగారాయప్రసాద్

నిజాంపేట్: నిజాంపేట్ శ్రీనివాసనగర్ కాలనీలో అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగారాయప్రసాద్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. ఆలయ అభివృద్ధికి విరాళం ఇవ్వడం అభినందనీయమని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇంద్రకుమార్ దేవ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మరమ్మతులకు అనుమతులు ఇప్పించండి

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌కు నడిగడ్డతండావాసుల వినతి



మియాపూర్: ఇటీవల కురిసిన వర్షానికి నడిగడ్డతండాలో పాడైన ఇళ్లకు మరమ్మతులు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండాలో గత యాభై సంవత్సరాలుగా 800 కుటుంబాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని అయితే సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కాలనీలోకి ఎలాంటి ముడి సరుకులు ఇటుక,సిమెంట్ ఇతర వస్తువులను తీసుకురాకుండా ఇబ్బందులుపెడుతున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయాయని వాటిని పునర్నిర్మాణం చేయనివ్వడం లేదని పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరమ్మతులకు అనుమతులు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బంజారా సేవా సంఘ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దశరథ్ నాయక్, తండా గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రత్నకుమార్, దేవనూరు లక్ష్మి, క్రిష్ణ నాయక్, కల్యాణి భాయ్, జానకి తదితరులున్నారు.

నిర్వహణ గాలికొదిలేశారు..

- ఇదీ ఫతేనగర్ రిజర్వాయర్ దుస్థితి
- నాలుగేళ్లుగా పిచ్చి మొక్కలను తొలగించని వైనం
- పట్టించుకోని ఫతేనగర్ సెక్షన్ అధికారులు





షాపూర్‌నగర్‌లోని ఫతేనగర్ రిజర్వాయర్ చుట్టూ కుంగిన భూమి, పెరిగిన పిచ్చి మొక్కలు

చింతల్: జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రిజర్వాయర్లు నేడు అందవిహీనంగా మారుతున్నాయి. రిజర్వాయర్లు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టిన సంస్థలు తూతూ మంత్రంగానే మెయింటనెన్స్ పనులు చేపడుతూ వస్తోంది. అక్కడక్కడ మిగిలిపోయిన మరమ్మతులు పనులను తిరిగి జలమండలి విభాగం వారే చేపడుతూ వస్తున్నారు. కాగా కూకట్‌పల్లికి చెందిన రిజర్వాయర్ కుత్బుల్లాపూర్‌లోని షాపూర్‌నగర్ సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణలో ఉన్న పంప్ హౌస్ పక్కనే నిర్మించారు. ఫతేనగర్ సెక్షన్‌కు షాపూర్‌నగర్ నుంచి నీటి సరఫరా అవుతూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

పత్తాలేని టెండర్లు దక్కించుకున్న సంస్థలు

కూకట్‌పల్లి డివిజన్–9 పరిధిలోని ఫతేనగర్ సెక్షన్ పరిధిలో స్థలాబావం కారణంగా కుత్బుల్లాపూర్‌లో ఆరు ఎంఎల్ రిజర్వాయర్‌ను షాపూర్‌నగర్‌లోని పంప్ హౌస్ పక్కన నిర్మించారు. ఫతేనగర్‌లో ఉన్న పంపింగ్ కేంద్రానికి షాపూర్‌నగర్ నుంచి నిరంతరం నీటిని తరలిస్తూ బస్తీలు, కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే రిజర్వాయర్ చుట్టుపక్కల నాలుగేళ్లుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

◆ ఇవి రాబోయే రోజుల్లో రిజర్వాయర్ నాణ్యతను దెబ్బతీసేలా ఉండడంతో నేడు రిజర్వాయర్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. నాలుగేళ్లుగా పిచ్చి మొక్కలను తొలగించడం లేదు. రిజర్వాయర్ల నిర్మాణంలో టెండర్లు దక్కించుకున్న పలు కార్పొరేట్ సంస్థలు మెయింటెనెన్స్ సుమారు మూడు నుంచి నాలుగు ఏళ్ల పాటు ఉన్నట్లు గతంలోనే జలమండలి అధికారులు ప్రకటించినా సిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

కుంగిపోతున్న రిజర్వాయర్ స్థలం..

ఫతేనగర్‌కు చెందిన ఈ రిజర్వాయర్ చుట్టూ ఉన్న ఖాళీ స్థలం రోజురోజుకు కుంగిపోతోంది. చుట్టూ ఉన్న ప్రహరీ రిటైనింగ్ వాల్ నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో నేడు భూమి లోపలికి కుంగిపోతోంది. అదేవిధంగా చుట్టూ పెరుగుతున్న చెట్లతో రిజర్వాయర్ నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వాయర్ చుట్టూ వేసిన సిమెంట్ బెడ్డు రిటైనింగ్ వాల్ కుంగిపోవడం వల్ల రిజర్వాయర్ చుట్టుపక్కల నీరు నిలిచిపోతోంది. వీటిపై దృష్టి సారించాల్సిన డివిజన్ అధికారులు, ఫతేనగర్ సెక్షన్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం వారి పనితీరుకు నిదర్శనంగా మారింది.

కుత్బుల్లాపూర్ ఆర్‌ఐ పరమేశ్వర్‌రెడ్డి సస్పెన్షన్

ఇన్‌చార్జ్ ఆర్‌ఐగా రేణుకాదేవి



కుత్బుల్లాపూర్: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) పరమేశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం, కైసర్‌నగర్‌లోని ఎస్ఎఫ్‌సీ భూములు హెచ్‌ఎండీఏకు బదలాయించిన ప్రభుత్వ స్థలాల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని రెవెన్యూ అధికారి కనుసన్నల్లోనే ఈ తతంగం జరుగుతోందని ఈనెల 1వ తేదీన పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఉన్నత అధికారులు రహస్య విచారణ చేపట్టి సదరు బాధ్యుడిగా ఉన్న పరమేశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం కలకలం రేపింది. ఆయన సస్పెండ్ కావడంతో ఇన్‌చార్జ్ ఆర్‌ఐగా రేణుకాదేవిని నియమిస్తూ మండల తహసీల్దార్ సంజీవరావు ఉత్తర్వులు జారీ చేశారు.

భయంతో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి..

స్థానికంగా విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందిని భూకబ్జాదారులు బెదిరించే స్థాయికి వెళ్లడం వెనుక రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయి. దీంతో అధికారులు భయంతో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వ స్థలాలు అన్ని భూకబ్జాదారుల కనుసన్నల్లోనే ఉన్నాయి. వాటిని కాపాడే ప్రయత్నం అధికారులు చేయకపోవడం గమనార్హం. ఒకవేళ కూల్చివేతలకు వెళ్తే దాడులకు దిగడం సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి ఘటనలు జరిగిన ప్రతిసారి పోలీసు కేసులు నమోదవుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆర్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న పరమేశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం చర్చానీయాంశమయ్యింది.

అధికారంలోకి రాగానే ఉద్యకారులపై కేసులను ఎత్తేస్తాం



ప్రజలతో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యకారులపై కేసులను ఎత్తివేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీ, దుర్గా ఎస్టేట్, బ్యాంక్ కాలనీ, ఎంఎస్‌రెడ్డి నగర్ ప్రాంతాల్లో ‘హాథ్ సే హాథ్ జోడో’యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విధానాలను ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

◆ అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా పని చేసిన ఉద్యమకారులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టి ద్రోహులను అందలమెక్కించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులకు గౌరవ వేతనాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమర్, నాయకులు బేకు శ్రీనివాస్, సూదుల సంపత్‌గౌడ్, పుల్లెం రాజు, అవిజె జేమ్స్, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, నార్సింగ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవో. 90పై కోర్టులో రిట్ వేశాం

బీజేపీ నాయకుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి



మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి రోడ్డులో హైరైజ్ అపార్ట్‌మెంట్లకు అనుమతిస్తున్నారని.. భవిష్యత్‌లో తీవ్ర ట్రాఫిక్ జామ్ తలెత్తే ఆస్కారముందని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులతో కలిసి ఆయన గురువారం కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... ఇప్పటికే రోడ్డు విస్తరణ తగ్గింపుతో ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్రధాన రోడ్డుకు 250 ఫీట్లలోపు భారీ బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ అనుమతులకు సంబంధించిన జీవో 90పై కోర్టులో రిట్ వేశామని తెలిపారు. అనుమతులు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కొంపల్లి మున్సిపల్ బీజేపీ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, బీజేవైఎం నాయకుడు శివాజీరాజు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి విషయంలో వెనుకంజ వేసేదే లేదు

ఎమ్మెల్యే వివేకానంద్



జీడిమెట్ల గ్రామంలో ఫిషర్‌మెన్ సొసైటీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: అభివృద్ధి విషయంలో వెనుకంజ వేసేది లేదని.. ఎన్ని రూ.కోట్లు ఖర్చు అయినా ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ పరిధి రావినారాయణరెడ్డినగర్‌లో గురువారం ఎమ్మెల్యే ప్రగతియాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంతో పోల్చుకుంటూ ప్రస్తుతం బస్తీల్లో మౌలిక సదుపాయాలు మెరుగపడ్డాయని అన్నారు. ప్రజలకు ఏ సమస్యలున్నా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. డీఈఈ రూపాదేవి, డీజీఎం అప్పలనాయుడు, ఏఈ కళ్యాణ్, మేనేజర్ రోహిణి, బీఆర్‌ఎస్ నాయకులు రషీద్ బైగ్, కస్తూరి బాల్‌రాజ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

◆ జీడిమెట్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న షిఫర్‌మెన్ కో.ఆపరేటీవ్ సొసైటీ భవనం మొదటి అంతస్తు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించగా పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సొసైటీ ప్రెసిడెంట్ చిలుకూరి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి యాదమ్మ, కార్యదర్శి మద్దూరి వీరేశ్ తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించాలి



కెమిక్ పరిశ్రమలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జీడిమెట్ల: అగ్నిప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్ సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం జీడిమెట్లలోని ఫేజ్–4లో ఉన్న కెమిక్ లైఫ్‌సైన్సెస్ పరిశ్రమలో జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశ్రమల్లో రసాయనాలను నిల్వచేసే పద్ధతులు, అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశ్రమలోని సిబ్బందికి వివరించారు. అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగినపుడు మంటలను ఏ విధంగా అదుపుచేయాలో వారికి సూచించారు. ప్రతి పరిశ్రమలో తప్పనిసరిగా యాజమాన్యం సేఫ్టీటీమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రసాయన సంచుల గోదాంలతో ప్రమాదం!

రంగారెడ్డినగర్: పారిశ్రామిక ప్రాంతాల్లో అక్రమ రసాయన సంచుల గోదాంలతో ప్రమాదం పొంచి ఉంది. నెల రోజుల క్రితం జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతం గంపల బస్తీలో ఓ రసాయన సంచుల శుద్ధి గోదాంలో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. అయితే ఘటనా సమయంలో సదరు గోదాంలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రగల్భాలు పలికిన ఐలా, ఇన్‌స్పెక్టర్ ఆఫ్‌ఫ్యాక్టరీస్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంతంలోని ఐడీపీఎల్ స్థలానికి ఆనుకని కూకట్‌పల్లికి వెళ్లే రహదారిలో ఓ గోదాంలో వివిధ పరిశ్రమల నుంచి సేకరించిన రసాయన సంచులను నిల్వ ఉంచుతున్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే సమీపంలోని పరిశ్రమలతో పాటు నివాస ప్రాంతాలకు మంటలు వ్యాపించి ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అస్కారముంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఐడీపీఎల్ ఖాళీ ప్రదేశానికి ఆనుకుని ఓ గోదాంలో నిల్వ ఉంచిన రసాయన సంచులు

'మనూ' దూరవిద్య పోర్టల్ పున:ప్రారంభం

- 21వ తేదీ వరకు రిజిస్ట్రేషన్

రాయదుర్గం: మనూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూర విద్యావకాశాల కోసం పోర్టల్‌ను పున: ప్రారంభించినట్లు ఉర్దూ విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ గురువారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ ('సెమిస్టర్ మోడ్–2020 బ్యాచ్, సెమిస్టర్ మోడ్–2019 బ్యాచ్) ప్రోగ్రామ్‌ల యొక్క ఫాలోఆన్ కోర్సులలో నమోదు కోసం పోర్టల్‌ను తెరిచి ఉంచడం జరిగిందన్నారు. ఫీజు చెల్లింపు పోర్టల్ మే 21 వరకు ఉంటుందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కోసం యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

ఇండియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ల ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శేరిలింగంపల్లి చందానగర్, యాప్రాల్ వంపుగూడల్లో ఇండియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌లను ప్రారంభించింది. ఈ రెండు నూతన శాఖలను ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేషరామన్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో జోనల్ మేనేజర్ చంద్ర ప్రకాశ్, ఉండియన్ బ్యాంక్ ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు.

ఏ దేశానికైనా యువతే ప్రధాన బలం

రాయదుర్గం: ఏ దేశానికై నా యువతే ప్రధాన బలమని ఉర్దూ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ (ఎస్‌ఈఅండ్‌టి) డీన్ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మెద్ మహమూద్ పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్(హెచ్ఎంఐ) వేసవి కోర్సులో పాల్గొన్న వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం యువ శక్తి చాలా గొప్పదన్నారు. మన యువతలో అపారమైన సామర్థ్యం ఉందని, వారు తమ శక్తిని దేశం, సమాజం యొక్క సమగ్రత, అభివృద్ధి, పురోగతి కోసం ఉపయోగించాలన్నారు. జాతీయ ఐక్యతను పెపొందించడానికి దేశం తమ శక్తిని ఉపయోగించాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈ అండ్ టీ హెడ్ ప్రొఫెసర్ మొహద్ మోషాహిద్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ అథర్‌హుస్సేన్, డాక్టర్ తయ్యబానజ్లీ, డాక్టర్ శంషాద్ బేగం, డాక్టర్ ఎహ్తెషాముద్దీన్, డాక్టర్ సబాఖాతూన్ పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఓయూ చీఫ్ వార్డెన్ కార్యాలయం ఎదుట హాస్టళ్లలో పని చేస్తున్న సిబ్బంది ధర్నాకు దిగారు. ఓయూలోని వివిధ ప్రైవేటు కాంట్రాక్టు సంస్థల ఆధ్వర్యంలో పని చేస్తున్న 382 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల నుంచి సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని సీఐటీయూ నాయకులు మహేందర్ పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో 1వ తేదీన చెల్లించాల్సిన వేతనాలను 20 వరకు ఇవ్వడం లేదని ఆరోపించారు వేతనం నుంచి ఈఎస్ఐ, ఈపీఎఫ్ కట్ అవుతున్నా ఇంత వరకు ఒక్కరి కూడా చెల్లించలేదన్నారు. అనంతరం చీఫ్ వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇచ్చారు.

జ్యోతిరావు పూలేకు మహాత్మా బిరుదు చరిత్రాత్మకం

ఉస్మానియా యూనివర్సిటీ: జ్యోతిరావు పూలే సేవలను గుర్తించి 1888, మే 11న మహాత్మా అనే బిరుదుతో సత్కరించడం చరిత్రలో నిలిచిపోయిందని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ పేర్కొన్నారు. గురువారం దూరవిద్య విద్యాకేంద్రం సెమినార్ హాల్లో జ్యోతిరావు పూలే రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో పూలేకు మే 11న మహాత్మా బిరుదును పురస్కరించుకొని జాతీయ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లమల్ల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, విశ్రాంత అధ్యాపకులు మురళి మనోహర్, అడపా సత్యనారాయణ, శ్రీనివాసులు, తిరుమలి పాల్గొని ప్రసంగించారు.

చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం



సాయి బృందావన్ ఎస్టేట్స్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. 14వ డివిజన్ సాయి బృందావన్ ఎస్టేట్స్‌లో శ్రీబాలాజీ సూపర్ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి, డయగ్నోస్టిక్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరి, కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, యూత్ ప్రెసిడెంట్ రాము, డాక్టర్ బాలాజీ, డాక్టర్ నాగప్రియ, డాక్టర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన పాస్టర్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్ పాస్టర్ అసోసియేషన్ సభ్యులు మేయర్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు స్టీఫెన్ పాల్, శౌరి, మోజెస్, చారి, యోష, జోసెఫ్, కుమార్, శేతు తదితరులు ఉన్నారు.

అనుమతులు లేకుండా డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు

కాలనీవాసుల ఆగ్రహం



ప్రశాంతి గోల్డెన్‌హిల్స్ పార్కు వద్ద కొనసాగుతున్న డ్రైనేజీ లైన్ నిర్మాణం

నిజాంపేట్: బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ముదిరాజ్ ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధి ప్రగతినగర్‌లోని ప్రశాంతి గోల్డెన్ హిల్స్ పార్కు నుంచి అధికార పార్టీ ప్రజాప్రతినిధికి చెందిన భవనానికి ఎలాంటి అనుమతులు లేకుండా డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు చేపట్టడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం డ్రైనేజీ పనులను పరిశీలించి సతీష్ దీనిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఓ ప్రజాప్రతినిధికి లబ్ధి చేకూర్చడం ఎంత వరకు సమంజసమని అన్నారు. దీనిపై అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'రేడియేషన్' పట్ల జాగ్రత్త వహించాలి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ 'రేడియేషన్'పై జాగ్రత్తలు పాటించాలని అమెరికాలోని మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ ఎస్ అజర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ విద్యార్థుల కోసం 'రేడియేషన్ అండ్ సేఫ్టీ మెజర్స్' అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉద్యోగాల్లో ఉన్నప్పుడు వివిధ రకాల రేడియేషన్‌లతో వారి రోజువారీ జీవితంలో ఎలా జాగ్రత్తగా ఉండాలో ఆయన వివరించారు. అమెరికాలో అల్లైడ్ హెల్త్ నిపుణులు తీసుకునే జీతం ప్యాకేజీలు వైద్యుల కంటే ఎక్కువగా ఉన్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా ఆయన తన ప్రసంగంలో వివిధ రకాల కిరణాలు, వాటి వ్యాప్తి స్థాయిల గురించి విద్యార్థులకు వివరించారు. భద్రతా చర్యలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్ ఖాన్, బి, ఒకేషనల్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్ మక్బూల్ అహ్మద్, అతిథి ఫ్యాకల్టీ డాక్టర్ ఖాజామోయిన్, డాక్టర్ కుల్సుమ్ జహ్రా, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలి

కుత్బుల్లాపూర్: బౌరంపేట్ శ్రీవేద ది యూనివర్స్ స్కూల్ చిన్నారులు ఏప్రిల్‌లో గోవా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో జరిగిన ఆల్ ఇండియా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటారు. ఏడుగురు చిన్నారులు రన్నింగ్‌లో 15 గోల్డ్, 1 సిల్వర్ పథకాలను సాధించారు. థాయిలాండ్‌లో త్వరలో జరుగనున్న థాయిలాండ్ ఇంటర్‌నేషనల్స్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విజేతలను అభినందించింది మెడల్స్ అందజేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కోచ్, నాయకులు పాల్గొన్నారు.



ఆల్ ఇండియా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీ విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు